క్లుప్తంగా

రిటన్స్‌పై అవగాహన



మాట్లాడుతున్న శివపార్వతిరెడ్డి

ముషీరాబాద్: జాతీయ గణాంకశాఖ పరిశ్రమ వార్షిక సర్వేలో భాగంగా జాతీయ గణాంక కార్యాలయం ఆధ్వర్యంలో డైరెక్టరేట్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ కార్యాలయంలో రిటన్స్‌పై అవగాహన, రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డిప్యూటీ డైరెక్టర్ శివపార్వతిరెడ్డి, తెలంగాణ రాష్ట్ర డీఈఎస్ డైరెక్టర్ దయానందం పాల్గొన్నారు. 'యానివల్ సర్వే ఆఫ్ ఇండస్ట్రీస్' ప్రతినిధులకు రిటన్స్ దాఖలు చేయడంపై శిక్షణ కల్పించి వారి సందేహాలను నివృత్తి చేశారు. కో– ఆర్డినేటర్ భరత్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన శ్యామలదేవీ నవరాత్రి ఉత్సవాలు



ముషీరాబాద్: ముషీరాబాద్‌లో శ్యామలదేవి నవరాత్రి ఉత్సవాలు ఆదివారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి లఘు శ్యామలదేవి కుంకుమార్చన, అష్టోత్తరం, సహస్రనామాలు, లలిత పారాయణం తదితర పూజా కార్యక్రమాలను శక్తి పీఠానందస్వామి చేతుల మీదుగా నిర్వహించారు. సాయంత్రం భక్తులకు అన్నదానం చేపట్టారు. ఈ ఉత్సవాల సందర్భంగా తొమ్మిది రోజుల పాటు వివిధ రూపాల్లో అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శనం కల్పిస్తామని నిర్వాహకులు తెలిపారు.

దళితులపై దాడులను అరికట్టాలి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: రోజు రోజుకు దళితులు, మైనార్టీలపై దాడులు పెరుగుతున్నాయని జిలకర శ్రీనివాస్ ప్రభుత్వాలను విమర్శించారు. నేషనల్ అట్రాసిటీస్ ప్రివెన్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక సవరణ చట్టం 2015 అమలుపై సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఇటీవల కోస్గీలో బాలరాజు, రేంజర్లలోని తుమ్మల కల్పన ఇంటిపై దిగంబర్ కోటగిరిలో దళిత ఉపాధ్యాయుడు మల్లికార్జున్‌పై దాడులు జరిగినా ఇప్పటిదాకా నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం స్పందించి ఈ దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. డీబీఎఫ్ జాతీయ కన్వీనర్ శంకర్, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు, నేషనల్ అట్రాసిటీ ప్రివెన్షన్ ఫోరం ప్రతినిధి రాంప్రసాద్, జయరాజు, రత్న, మహేశ్వరరాజు తదితరులున్నారు.

ముగిసిన వర్క్‌షాప్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీ పొలిటికల్ సైన్స్ విభాగంలో మూడ్రోజుల పాటు జరిగిన డిగ్రీ అధ్యాపకుల వర్క్‌షాప్ ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా వీసీ ప్రొ.రవీందర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఉపన్యసించారు. అనంతరం వర్క్‌షాప్‌లో పాల్గొన్న డిగ్రీ కాలేజీల పొలిటికల్ సైన్స్ అధ్యాపకులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు రూపావత్ చంద్రునాయక్, చెన్న బసవయ్య, శ్రీలత, సతీష్‌చంద్ర పాల్గొన్నారు.

ఎంఈడీ, ఎంపీఈడీ జాబితా విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూతో పాటు ఇతర వర్సిటీల పరిధిలోని కాలేజీల్లో ఎంఈడీ, ఎంపీఈడీ కోర్సుల్లో సీటు సాధించిన విద్యార్థుల చివరి జాబితాను విడుదల చేసినట్లు సీపీజీఈటీ–2022 కన్వీనర్ ప్రొ.పాండురంగారెడ్డి తెలిపారు. అడ్మిట్‌కార్డుతో పాటు ఇతర ఒరిజినల్ సర్టిఫికెట్లను ఈ నెల 25 వరకు ఆయా కాలేజీల్లో రిపోర్టు చేయాలన్నారు. ఎంఈడీ, ఎంపీఈడీ కోర్సులలోని మొత్తం 891 సీట్లలో 550 సీట్లు భర్తీ కాగా ఎంఈడీలో 300 సీట్లు మిగిలినట్లు కన్వీనర్ పేర్కొన్నారు.

అభివృద్ధి పనులను సత్వరమే పూర్తిచేయాలి

చాదర్‌ఘాట్: డివిజన్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేయాలని ఎంఐఎం ఓల్డ్‌మలక్‌పేట అధ్యక్షుడు షఫీయుద్దీన్ అధికారులను కోరారు. ఆదివారం ఆయన జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి డివిజన్‌లో పర్యటించారు. వాహెద్‌నగర్‌లో నిర్మాణంలో ఉన్న సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అభివృద్ధి పనుల్లో నాణ్యత, ప్రమాణాలు కచ్చితంగా పాటించాలన్నారు. జీహెచ్ఎంసీ అధికారులు ప్రదీప్‌కుమార్, సత్యనారాయణ, ఎంఐఎం నాయకులు పాల్గొన్నారు.

ఆందోళన.. ఆగ్రహం .. అవకాశం!



ఐద్వా ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



ఎరుకల సంఘం కేలండర్ ఆవిష్కరణ

ముషీరాబాద్: మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు ఎంపీ బ్రిజ్ భూషన్‌ను అరెస్టు చేయాలని ఐద్వా గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి నాగలక్ష్మి డిమాండ్ చేశారు. రెజ్లర్లకు మద్దతుగా ఐద్వా ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఐద్వా నాయకులు వరలక్ష్మి, రాణి, అండమ్మ, పద్మ, లక్ష్మి పాల్గొన్నారు.

బీసీ విద్యార్థుల ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలి..

కవాడిగూడ: బీసీ, ఎస్సీ, ఎస్టీలు అంటే రాష్ట్ర ప్రభుత్వానికి లెక్కలేకుండా పోయిందని, వారితో ఓట్లు వేయించుకుని వదిలేసే వైఖరిని రాష్ట్ర ప్రభుత్వం మార్చుకోవాలని హితవు పలికారు. లేనిపక్షంలో రాష్ట్ర ప్రభుత్వానికి బీసీలు చరమగీతం పాడతారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు.

- గురుకులాల్లో ప్రతి విద్యార్థికి రూ.1,25000లు ఖర్చు చేస్తున్నామని ప్రభుత్వం చెబుతోందని ఈ మొత్తాన్ని చెల్లించకపోతే 'కేసీఆర్‌కు హటావో బీసీలకు బచావో' అనే నినాదంతో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు.
- రాష్ట్రంలో 12 లక్షల మంది పేద విద్యార్థుల చదువులకు భరోసా ఇచ్చి సాఫీగా కొనసాగాలంటే పెండింగ్‌లో ఉన్న రూ.3250 కోట్ల ఫీజుల బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు.
- రాష్ట్రంలో కట్టాల్సింది సచివాలయం, కలెక్టరేట్ల భవనాలు కాదని సంక్షేమ భవనాలు నిర్మించాలని సూచించారు. బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు విక్రమ్‌గౌడ్, రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌ముదిరాజ్, నాయకులు రామకృష్ణ, శ్రీనివాస్‌గౌడ్, నాగేష్, రాజు, మల్లికార్జున్, విజయ్, నాగరాజు, గౌతమ్ తదితరులున్నారు.

ఎరుకల కులస్తులకు అవకాశం కల్పించాలి..

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: వచ్చే ఎన్నికల్లో అన్ని రాజకీయపార్టీలు ఎరుకల కులానికి తగిన ప్రాధాన్యత కల్పించి పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని తెలంగాణప్రదేశ్ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో ఎరుకల సంఘం క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. గిరిజన సామాజిక భవనాన్ని కేటాయించినట్లుగానే ఎరుకల సామాజిక భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ. 24 కోట్లు కేటాయించి రాష్ట్ర ప్రభుత్వంలో నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం కల్పించాలన్నారు. ఎరుకల సంఘం ప్రధాన కార్యదర్శి కృష్ణ, చంద్రయ్య, వేణుకుమార్, కోశాధికారి విజయ్‌కుమార్, సత్యనారాయణ పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి

ముషీరాబాద్: టీఐఈ, ఆర్‌టీపీ రూపొందించిన నూతన కేలండర్‌ను మంత్రి సబితాఇంద్రారెడ్డి నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు ఇచ్చిన గెజిట్ ఆధారంగా ప్రతి పాఠశాలలో ప్రత్యేక ఉపాధ్యాయులను నియమించి సమగ్ర శిక్షణలో పనిచేస్తున్న ఐఈఆర్‌టీలను విలీనం చేయాలన్నారు. ఐఈఆర్‌టీల బదిలీలను సాధారణ ఉపాధ్యాయులతో పాటు చేపట్టాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు సమాచారం. టీఐఈ ఆర్‌టీపీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయచారి, రాష్ట్ర కోశాధికారి దామోదరాచారి, వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లేష్, శ్రీనివాస్‌లు, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు సునిత, ఎస్‌కె. పాషా, శ్రీనివాస రాజు, రవికిరణ్, విజయలక్ష్మి తదితరులున్నారు.

- న్యూ అభయ సెంట్రింగ్ అండ్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్రశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 2023 నూతన కేలండర్, డైరీని అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌లు రజని, శిరీష, జాషువాపాల్‌లు ముఖ్య అతిథులుగా హాజరై ఆవిష్కరించారు. యూనియన్ చైర్మన్ వాసుదేవ్, అధ్యక్షులు నర్సింహ, ప్రధాన కార్యదర్శి షమీన్, వైస్‌చైర్మన్ యాదగిరి, కోశాధికారి, సదానంద్, సహకార్యదర్శులు నారాయణ, రాములు, సభ్యులు శ్రీనివాస్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

బీసీల కులగణన చేపట్టాలి



మాట్లాడుతున్న బలహీన వర్గాల సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్

కాచిగూడ: బీహార్ సీఎం నితీష్‌కుమార్ బీహార్‌లో నిర్వహిస్తున్న జనాభా లెక్కలను సవాల్ చేస్తూ వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేసి జనాభా లెక్కలను చేసుకోవచ్చని ఇచ్చిన తీర్పు బీసీలకు శుభవార్త అని తెలంగాణ బలహీన వర్గాల సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌పటేల్ అన్నారు. ఆదివారం కాచిగూడలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ కులగణన చేపట్టి జనాభా ప్రాతిపదికన బీసీలకు 54 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బీసీల హక్కుల కోసం నిరసన తెలపకుండా రాష్ట్రంలో నియంతపాలన సాగుతోందని ఆరోపించారు. రాములు, వెంకటేష్, రమేష్, వెంకటేష్‌గౌడ్, దస్తగిరి ముదిరాజ్, రామయాదవ్, ప్రమోద్, అశోక్, నవీన్ తదితరులున్నారు.

రూ. 26.5 లక్షలతో అభివృద్ధి పనులు



నల్లకుంట: నియోజక వర్గంలోని అన్ని బస్తీలు, కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకరణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. శివిజన్ నర్సింహబస్తీలో రూ. 26.5 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేయనున్న డ్రైనేజీ పైప్ లైన్ పనులకు కార్పొరేటర్ అమృతతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. బస్తీలో రూ. 17.5 లక్షలతో తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులను కూడా చేపడుతున్నామన్నారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలకు సమాన ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి చేస్తున్నామన్నారు. జలమండలి డీజీఎం, డీఈ విష్ణు ప్రసాద్, ఏఈ రోహిత్, నర్సింహబస్తీ అధ్యక్ష కార్యదర్శులు భూపతినాథ్, శ్రీనివాస్, నల్లకుంట ఎస్సైలు అంజయ్య, రమాదేవి, బీఆర్‌ఎస్ పార్టీ నల్లకుంట డివిజన్ అధ్యక్షుడు మేడిప్రసాద్, బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్, బస్తీ నాయకులు మహేందర్, లక్ష్మణ్, బుచ్చయ్య, ఓం ప్రకాష్ తదితరులున్నారు.

మన సంస్కృతిలో ముగ్గులకు విశిష్ట స్థానం



ముషీరాబాద్: మనదేశ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు తెలియజేసేందుకు ముగ్గుల పోటీలు ఎంతగానో దోహదపడతాయని చిక్కడపల్లి ఏసీపీ యాదగిరి అన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో రంగవల్లులకు విశిష్ట స్థానం ఉందన్నారు. పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్, బీఆర్‌ఎస్ గ్రేటర్ సీనియర్ నాయకుడు శ్రీనివాస్‌రావు, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నాగేష్‌ముదిరాజ్ చిక్కడపల్లి ఏసీపీ యాదగిరి, సీఐలు జహంగీర్ యాదవ్, సంజీవ్‌కుమార్ హాజరై ముగ్గులను పరిశీలించారు. సంఘం అధ్యక్షుడు సుదేష్, మహిళా అధ్యక్షురాలు ఊర్మిళ సంఘం ప్రధాన కార్యదర్శి మనోహర్, కోశాధికారి సతీష్‌కుమార్, నాయకులు నవీన్, నిర్మల, బన్నీ, శ్రీధర్ తదితరులున్నారు.

కరాటేతో ఆత్మవిశ్వాసం మెరుగు

కాచిగూడ: కరాటే సాధనతో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెరుగుతుందని నిజామాబాద్ డీసీపీ గిరిరాజు అన్నారు. కాచిగూడలోని జీవీఆర్ కరాటే అకాడమీలో ఆదివారం జరిగిన బెల్ట్‌గ్రేడ్ ఎగ్జామినేషన్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఆయన బెల్టులు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఆత్మరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కరాటే నేర్చుకోవాలని సూచించారు. జీవీఆర్ కరాటే అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జీఎస్ గోపాల్‌రెడ్డి, కరీం, సుభాష్, శ్యామ్‌కుమార్, హంస, మహేందర్, అమృతరెడ్డి, జానకి, యోగిని, షైనీ, నందిని తదితరులు పాల్గొన్నారు.



పుస్తకావిష్కరణ



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఉస్మానియా పీజీ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పద్మాచారి యాత్ర రచన '' ఆధ్యాత్మిక దారుల్లో చార్‌ధామ్ యాత్ర'' పుస్తకాన్ని తెలుగు విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎన్.గోపి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి పుస్తకాలు సమాజంలో మంచి మార్పును తీసుకొస్తాయన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.రఘు, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం, ప్రొఫెసర్ అంజయ్య, యాత్ర చరిత్ర తొలి సిద్ధాంత గ్రంథకర్త డాక్టర్ హరిదాసు తదితరులు పాల్గొన్నారు.

498- ఏ కేసులో ఎన్‌ఆర్‌ఐలకు ఊరట



నిహారికరెడ్డి

చిక్కడపల్లి: 498–ఏ కేసులో ఎన్‌ఆర్‌ఐలకు లుక్‌అవుట్ సర్క్యులర్ (ఎల్‌ఓసీ) జారీ విషయంలో ఉపశమనం కలిగేలా హైకోర్టు మార్గదర్శకాలు, ఆదేశాలు జారీ చేసిందని ప్రముఖ న్యాయవాది డి.నీహారికరెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. 498 ఏ కేసులో బెయిల్ పొందిన తర్వాత కూడా ఎల్‌ఓసీ జారీ చేయడం వల్ల ఇబ్బందులు పడ్డ తన క్లయింట్ విషయంలో గత ఏడాది జూన్‌లో రిట్ పిటీషన్ వేశారన్నారు. ఎల్‌ఓసీ జారీ వల్ల ఎన్‌ఆర్‌ఐలు పడుతున్న ఇబ్బందుల్ని తాము న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లగా.. ఈనెల 9న దీనికి సంబంధించిన కొన్ని మార్పులతో మార్గదర్శకాలు విడుదల చేశారని వివరించారు. ఓసారి బెయిల్ మంజూరైన తర్వాత వారిపై ఎల్‌ఓసీ ఇవ్వకూడదని పోలీసులకు సూచించినట్లు నీహారికరెడ్డి పేర్కొన్నారు.

కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా విజయ్‌రావు

ముషీరాబాద్: రాంనగర్ డివిజన్‌లోని ఎస్‌ఆర్‌టీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కె.విజయ్‌రావు గెలుపొందారు. ఆదివారం ఎస్‌ఆర్‌టీ కాలనీ కమ్యూనిటీహాల్‌లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు ఎన్నికలు జరిగాయి. మొత్తం ఓటర్లు 424 మంది ఉండగా ఓటింగ్‌లో 323 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలైన ఓట్లలో విజయ్‌రావుకు 190 ఓట్లు, జోబుకు 130 ఓట్లు రాగా రెండు ఓట్లు చెల్లనివి ఉన్నాయి. దీంతో విజయరావు 59 ఓట్లతో గెలిచినట్లు ఎన్నికల అధికారి లక్ష్మీనారాయణ ప్రకటించారు. బల్వీర్‌కుమార్, మధు, రత్నాకర్, జనార్దన్, శశికళ, చిట్టెమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

గోల్నాకలో కార్డెన్ సర్చ్

అంబర్‌పేట: అంబర్‌పేట పోలీసులు గోల్నాకలో కార్డెన్ సర్చ్ నిర్వహించారు. శనివారం అర్ధరాత్రి తులసీరాంనగర్ లంకలో ఇన్‌స్పెక్టర్ సీహెచ్. ప్రభాకర్ ఆధ్వర్యంలో సుమారు 60 మంది పోలీస్ అధికారులు ఇంటింటికీ వెళ్లి తనిఖీలు నిర్వహించారు. సరైన పత్రాలు, నెంబర్ ప్లేట్లులేని 11 వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. నేరాల నియంత్రణతో పాటు ప్రజలకు భరోసా కల్పించడమే లక్ష్యంగా కార్డెన్ సర్చ్ నిర్వహిస్తున్నామని పోలీసులు తెలిపారు. ఏదైనా ప్రమాదం, అత్యవసర సమయాల్లో 100కు డయల్ చేయాలని ఆయన స్థానికులకు సూచించారు. నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్సైలు మల్లేశం, మౌనిక, శిరీష, మధు, విజయ్ తదితరులున్నారు.

వైభవంగా వీరభద్రస్వామి కల్యాణోత్సవం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

కాచిగూడ: భద్రకాళీ సమేత వీరభద్రస్వామి వారి కల్యాణోత్సవ వేడుకలు కాచిగూడలో వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో వేలాది మంది భక్తులు పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. స్వామివారి శోభాయాత్ర పురవీధుల్లో ఘనంగా జరిగింది. అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కృష్ణ మోహన్‌రావు, కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్ యాదవ్, వీరభద్రస్వామి సేవా సమితి అధ్యక్షుడు వెంకటేశం, ప్రధాన కార్యదర్శి వినోద్, రామునాయక్, సత్యనారాయణ, బాలకృష్ణ, కిడాంబి శ్రీకాంతాచార్యులు, శ్రీనివాసులు, అనిల్‌కుమార్, శివకిరణ్, కరుణ, మణికొండ వెంకటేశ్వర్‌రావు, వినోద్‌కుమార్, పాండురంగారావు, హరిబాబు, విజయ్‌పటేల్, నాగేష్, ఆనంద్, మల్లికార్జున్ తదితరులున్నారు.

గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో బోనాలు..

కవాడిగూడ: భోలక్‌పూర్‌లోని మహంకాళి దేవాలయంలో అమ్మవారికి గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు శంకర్, ఆలయ కమిటీ చైర్మన్ గోవింద్‌రాజ్‌ల ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలు గంగపుత్రుల సంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు. ఎమ్మెల్యే ముఠాగోపాల్, బీఆర్ఎస్ యువజన విభాగం నగర నాయకుడు ముఠా జైసింహ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయగా వారిని సంఘం అధ్యక్షుడు సత్కరించారు. భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్‌రావు, సంఘం ప్రధాన కార్యదర్శులు సాయి, ఆనందరావు, నాయకులు వెంకటేష్, శివ, నర్సింగ్ తదితరులున్నారు.



ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ ఉమారమేష్‌యాదవ్ తదితరులు



బోనాల ఉత్సవాలకు హాజరైన ఎమ్మెల్యే ముఠాగోపాల్

కులవివక్షత లేని సమాజాన్ని నిర్మించాలి



కవి సమ్మేళనంలో మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: కులవివక్షత లేని సమాజాన్ని నిర్మించినప్పుడే సమాజం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. మతసామరస్యాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆదివారం సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో షిర్డిసాయి సేవా సమితి ఆధ్వర్యంలో కవి సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఆధునిక కాలంలో కూడా కులవివక్షత కొనసాగడం అత్యంత బాధాకరమన్నారు. రచయితల సంఘం అధ్యక్షుడు డాక్టర్ కృష్ణ, షిర్డిసాయి సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు జీఎస్ సాంబశివరావు, విద్యాధర్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, రాజావాసిరెడ్డిమల్లేశ్వరి, మంజుల సూర్య పాల్గొన్నారు.

నాదయోగ కల్చరల్ వార్షికోత్సవం



చిక్కడపల్లి: నాదయోగ కల్చరల్ ఆర్గనైజేషన్ మూడో వార్షికోత్సవం వ్యవస్థాపకులు మేడికొండలూరు నాగవర్ధిని, సహ వ్యవస్థాపకులు గణపతిల నిర్వహణలో శాస్త్రీయ సంగీతం అలరించింది. ఆదివారం రాత్రి త్యాగరాయగానసభలో వర్ధమాన కళాకారులను ప్రోత్సహించేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. డిజైర్ సంస్థతో పాటు నాదయోగ కల్చరల్ ఆర్గనైజేషన్ సంయుక్తంగా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తూ కళాకారులను ప్రోత్సహిస్తోంది. మాక్స్‌విజన్ ఆసుపత్రి ఫౌండర్ కాసు ప్రసాద్‌రెడ్డి, బాబ్జీ, శ్రీమీర్, బాలకామేశ్వరరావు, నవీన్‌శెట్టి, ప్రధాన కార్యదర్శి సునీల్, ఉపాధ్యక్షుడు కమల్, కోశాధికారి జ్యోతి, సంయుక్త కార్యదర్శి రామకృష్ణ, యోగిత అక్కిరాజు, లావణ్య, గణేష్ పాల్గొన్నారు.

గోవా తరహా జీహెచ్‌ఎంసీని అభివృద్ధి పరుస్తాం



ప్లాంట్‌ను పరిశీలిస్తున్న శ్రీలత శోభన్‌రెడ్డి, కార్పొరేటర్లు

లాలాపేట: గోవా తరహా జీహెచ్‌ఎంసీని అభివృద్ధి పరుస్తామని డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి పేర్కొన్నారు. ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి ఆదివారం గోవాలోని సాలిడ్ వేస్ట్ మెనేజ్‌మెంట్ ప్లాంట్‌లను సందర్శించారు. చెత్తను ప్రాసెస్ చేసే ప్రక్రియపై అక్కడి అధికారులతో అడిగి తెలుసుకున్నారు. గోవాలో మూడ్రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో పబ్లిక్ సర్వీస్ సౌకర్యాలు, మున్సిపల్ కార్పొరేషన్ చట్టం, న్యాయపరమైన అంశాలు, సాలిడ్ వేస్ట్ మెనేజ్‌మెంట్ తదితర అంశాలపై చర్చించామన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో జీహెచ్‌ఎంసీలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.డిప్యూటీ మేయర్ వెంట కార్పొరేటర్లు మాధవరం రోజాదేవి, దేవదీప్తి ఉన్నారు.

దళిత క్రిస్టియన్, ముస్లిం, ఆదివాసీల పట్ల కేంద్రం వివక్ష

ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ ఆరోపణ



లాలాపేట: దళిత క్రిస్టియన్, ముస్లిం, ఆదివాసీల పట్ల కేంద్రం వివక్ష చూపుతోందని దక్షిణ భారత సమితి కన్వీనర్ ప్రొ. గాలి వినోద్‌కుమార్ ఆరోపించారు.ఆదివారం తార్నాకలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. క్రైస్తవ మతం మార్చుకున్న ఓబీసీలు, గిరిజనులకు రిజర్వేషన్లు కల్పిస్తున్న కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలు మతం మార్చుకున్న దళితులు, ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించకుండా వివక్షతను ప్రదర్శిస్తుందన్నారు. భారత రాజ్యాంగం 25వ అధికరణ ప్రకారం మత స్వేచ్ఛ కల్పించిందని దీని ప్రకారం ఎవరైనా ఏ మతమైనా తీసుకోవచ్చు.. ఏ దేవున్నైనా ఆరాధించుకోవచ్చని చెప్తుందనారు. కానీ అందుకు విరుద్ధంగా దళితులు హిందూ మతం మారితే రిజర్వేషన్లు వర్తించవని చెప్పడం రాజ్యాంగ విరుద్ధమని అది ప్రాథమిక హక్కుల ఉల్లంఘన కిందకే వస్తుందని పేర్కొన్నారు. దీనికి అడ్డుగా ఉన్న రాష్ట్రపతి ఆర్డినెన్స్ పేజి నెంబర్–3 వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. షెడ్యూల్డ్ కులాల హోదా కల్పించాలని డిమాండ్ చేస్తూ నేడు (ఈ నెల 23న) వరంగల్‌లోని సెంటినరీ బాప్టిస్టు చర్చి క్రిస్టియన్ కాలనీలో జరిగే ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలన్నారు.

అవార్డు అందజేత

అడ్డగుట్ట: మాదిగ ఉపకులాల మేధావుల ఫోరం సంఘం ఆధ్వర్యంలో అడ్డగుట్ట డివిజన్‌కు చెందిన సామాజిక సేవకులు విక్కుర్తి పోచయ్యకు అవార్డును అందజేశారు. సమాజంలో బాధ్యతాయుతంగా సామాజిక సేవలు అందిస్తూ, ప్రజల మన్ననలను పొందుతున్న సంఘం సభ్యులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. రైల్వే రిటైర్డ్ ఉద్యోగి విక్కుర్తి పోచయ్య, వెంకటేష్‌ను మాదిగ, మాదిగ ఉపకులాల మేధావుల ఫోరం అధ్యక్షులు చీమ శ్రీనివాస్ శాలువాలతో సత్కరించి అవార్డును అందజేశారు.